ప్రజాశక్తి

సోమవారం 07 ఏప్రిల్ 2025

5

కర్నూలు

ఆస్తులు కాజేసేందుకే..!



- ప్రాథమిక హక్కులను హరించేలా చట్టం
- వక్ఫ్ చట్ట సవరణపై పలు పార్టీలు, సంఘాల మండిపాటు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/కార్పొరేషన్

కేంద్ర ప్రభుత్వం లోక్‌సభ, రాజ్యసభలో వక్ఫ్ చట్ట సవరణ బిల్లును ఆమోదింపజేసుకుంది. దీనిపై పలు పార్టీలు, సంఘాలు మండిపడుతున్నాయి. ఆస్తుల కాజేతకే ఈ చట్ట సవరణ చేశారని పలువురు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హక్కులను హరించేలా ఈ బిల్లు ఉందని అంటున్నారు...

ఉమ్మడి కర్నూలు జిల్లాలో సుమారు 25వేల ఎకరాల వక్ఫ్ భూములు ఉన్నాయి. రోజు రోజుకూ ఆ భూములు అన్యాక్రాంతానికి గురవుతున్నాయి. వాటిని రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉండగా ఇటీవల వక్ఫ్ చట్ట సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం లోక్‌సభ, రాజ్యసభలో ఆమోదింపజేసుకుంది. దీనికి రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి, జనసేన మద్దతునిచ్చాయి. దీంతో జిల్లాలోని ముస్లిముల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఇంతకు ముందు ఉన్న వక్ఫ్ చట్టం, వక్ఫ్ ఆస్తుల యొక్క సక్రమ పరిపాలన, ఆక్రమణల నుండి రక్షణతో పాటు ముస్లిం సమాజ ప్రయోజనాలకోసం నిధులను వినియోగించడాన్ని నిర్ధారించింది. అయితే, కొత్త వక్ఫ్ సవరణ చట్టం అనేక అసంబద్ధ విధానాలను కలిగి ఉంది. బిజెపి ప్రభుత్వం మంద బలంతో ఈ చట్టాన్ని పార్లమెంట్ ద్వారా ముందుకు తీసుకువెళుతోంది. తద్వారా రాజ్యాంగంలో హామీ ఇచ్చిన అల్పసంఖ్యాక హక్కులను అడ్డుకుంటూ, హిందుత్వ ఎజండాను మరింత ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో జిల్లాలోని ముస్లిముల్లో తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇప్పటికే పలు సంఘాలు ఆందోళన బాట పట్టాయి. ఈ వక్ఫ్ చట్ట సవరణపై పలు పార్టీలు, ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి.

'వక్ఫ్' చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

వక్ఫ్ సవరణ చట్టాన్ని పార్లమెంటు ఆమోదించడాన్ని సెక్యులర్ సంస్థలు, ప్రజానీకం ముక్తకంఠంతో ఖండించాలి. ఈ చర్య విభేధాలను పెంచుతూ దేశపు సెక్యులర్ తత్వానికి చేటుచేస్తుంది. తాజా సవరణలతో రాష్ట్ర వక్ఫ్ బోర్డులు రద్దు చేయడం, వాటి అధికారాలను కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోకి బదిలీ చేయడం, తద్వారా కేంద్రీకరణను ప్రోత్సహించడం వంటి చర్యలకు పాల్పడ్డారు. ఇది ఫెడరలిజానికి విరుద్ధం. ఈ సవరణల కారణంగా ఎక్కువగా వక్ఫ్ ఆస్తులు ప్రభుత్వ ఆక్రమణకు గురవుతాయి. వక్ఫ్ ట్రిబ్యునల్ యొక్క అధికారాలను తొలగించడం వల్ల, వక్ఫ్ బోర్డు కూడా ఏ విధమైన న్యాయ సహాయం అందించలేకపోతుంది. ఈ సవరణల ద్వారా, కేంద్ర ప్రభుత్వం ముస్లింల హక్కులపై దాడిచేసే తన విధానాన్ని కొనసాగిస్తోంది. ఇది సిటిజన్‌షిప్ అమెండ్మెంట్ యాక్ట్ (సిఎఎ)తో పోల్చదగినది. దేశంలోని సెక్యులర్, ప్రజాస్వామ్య నిర్మాణాన్ని కాపాడేందుకు అభ్యుదయ శక్తులు ఏకం కావాలి. వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి.

- డి.గౌస్ దేశాయ్, సిపిఎం జిల్లా కార్యదర్శి.

మైనార్టీల ప్రాథమిక హక్కును హరించడమే

వక్ఫ్ చట్ట సవరణ రాజ్యాంగ విరుద్ధం. రాజ్యాంగం మైనార్టీలకు కల్పించిన ప్రాథమిక హక్కులను హరించడమే. వక్ఫ్ చిరచరాస్తులను సక్రమమైన పద్ధతుల్లో నిర్వాహణ చేయవలసిన ప్రభుత్వాలు కబ్జాకోరులు కబ్జా చేస్తూ ఉంటే రక్షించడం మాని ప్రభుత్వాలే అక్రమాలకు తెర తీయడం దారుణం. కేంద్ర ప్రభుత్వం తన మనువాద అజెండాతో ముందుకు పోతోంది. దేశ ఐక్యతను, ధార్మిక సంస్థలపై పూర్వీకులు ఇచ్చిన ఆస్తులను రక్షించుకోవడానికి లౌకిక ప్రజాతంత్ర సంఘాలతో ప్రజలతో ఐక్యంగా పోరాటాలను ఉద్యమాలను చేసి ఐక్యతను రాబోయే కాలంలో కాపాడుకోవాలి. దాని కోసం శ్రమించాలి.

- ఎస్ఎ.సుభాన్, ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు.

వక్ఫ్ ఆస్తులను కాజేయడానికి పన్నాగం

బిజెపి ప్రభుత్వం మైనార్టీల ఆస్తులను రాజేయడానికి పార్లమెంట్‌లో సవరణ బిల్లు ఆమోదించుకుని చట్టం చేయనుంది. బిజెపి ప్రభుత్వం వక్ఫ్ ఆస్తులను కాజేయడానికే ఆర్ఎస్ఎస్ అజెండాను అమలు చేస్తుంది. వారే పనులను సుగము చేసుకోవడానికి ఈ చట్టం చేస్తోంది. ఈ చట్టం మైనార్టీలను ఇబ్బంది కలిగించి వారి ఆస్తులను కులగొట్టేందుకే కుట్ర పన్నింది. తర్వాత క్రిస్టియన్ ఆస్తులను కూడా ఖాళీ చేస్తుంది. ఐక్యంగా బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలి.

- బి.గిడ్డయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి.

ఆస్తులను కొల్లగొట్టడమే ప్రధాన లక్ష్యం

ముస్లిం వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టడమే ప్రధాన లక్ష్యంగా వక్ఫ్ సవరణ చట్టాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది. రాజ్యాంగం ప్రత్యేకంగా ముస్లింలకు హక్కును కల్పిస్తూ ఈ చట్టాన్ని చేసింది. దానికి సవరణ ముస్లింల హక్కులను కాలరాయడమే. ముస్లింల అణిచివేతకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది. దేశ ప్రజలను మతం పేరుతో విభజించే చర్యలకు బిజెపి పాల్పడుతోంది. చంద్రబాబు నాయుడు 40 ఏళ్ల అనుభవం కలిగిన సిఎంనని చెబుకుంటూ వక్ఫ్ బోర్డు బిల్లు సవరణకు ఆమోదం తెలపడం పట్ల ముస్లిం సామాజిక వర్గం క్షమించ బోదు.

- ఎంఏ.హాఫీజ్ ఖాన్, మాజీ ఎమ్మెల్యే

సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలి. మైనారిటీలకు సంబంధించిన ఆస్తులను తమ ఆధీనంలోకి ఉంచుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలో భాగంగానే ఈ బిల్లును తీసుకువచ్చారు.

- బాబురావు, డిసిసి మాజీ అధ్యక్షులు.

అన్యాయం జరగకుండా చంద్రబాబు చూసుకుంటారు

మైనార్టీలతో పాటు మంచి అధికారి ఉంటే వక్ఫ్ ఆస్తులు పరిరక్షణకు బాగుంటుందనే అభిప్రాయంతో ఈ నిర్ణయం తీసుకుని ఉంటుంది. వైసీపీ ప్రభుత్వ అధికారంలో ఎంత వరకు వక్ఫ్ భూములను కాపాడారో చెప్పాలి. వక్ఫ్ చట్ట సవరణతో ఏదైనా నష్టం జరిగితే టీడీపీ మైనార్టీ నాయకులంత చంద్రబాబు దగ్గరికి వెళ్లి చెబుతాం. ముస్లిం మైనార్టీలకు అన్యాయం జరగకుండా చంద్రబాబు చూసుకుంటారు.

- వాహిద్ హుస్సేన్, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు.

కెజిబివిల్లో ఉత్తమ విద్యా బోధన

- పాఠశాలలో మౌలిక వసతుల కల్పన
- వలస విద్యార్థులకు సీజనల్ హాస్టల్స్
- ఎస్ఎస్ఎ అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో విద్యార్థులకు ఉత్తమ విద్యా బోధన అందించేందుకుగాను చర్యలు తీసుకుంటున్నామని సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ టి.శ్రీనివాసులు తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనకు మనబడి మన భవిష్యత్తు కార్యక్రమం కింద చర్యలు తీసుకుంటున్నామన్నారు. వలస వెళు న్నటువంటి కుటుంబాల పిల్లలను ఇక్కడే ప్రత్యేకంగా సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేసి అక్కడ విద్యార్థులకు వసతి సౌకర్యం కూడా కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు..

కెజిబివిల్లో ప్రతి ఏడాది అడ్మిషన్లకు డిమాండ్ పెరుగుతోంది. సీట్లను పెంచాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై మీ స్పందన ఏమిటి?

ఎపిసి : కేజీబీవీ పాఠశాలల్లో అడ్మిషన్లకు అధిక సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. అడ్మిషన్ సీట్ల సంఖ్య పెంచేందుకుగాను విద్యార్థి సంఘాలు కూడా మా దృష్టికి తీసుకువచ్చాయి. జిల్లా కలెక్టర్ ద్వారా ఎస్పిడి దృష్టికి తీసుకు వెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కేజీబీవీల్లో మెరుగైన విద్యాబోధన అందించేందుకు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా పర్యవేక్షణ చేస్తున్నాం. హాస్టల్లో నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నాం.

వలస కుటుంబాల విద్యార్థుల కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎపిసి : కర్నూలు జిల్లాలో వలసలు వెళు న్నటువంటి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు విద్యను అందించేందుకుగాను 34 సీజనల్ హాస్టల్స్‌ను కూడా ప్రారంభించాము. ఈ హాస్టల్లో విద్యార్థులకు ఉచితంగా వసతి భోజన సౌకర్యాన్ని కల్పించడమే కాకుండా ప్రత్యేకంగా ట్యూటర్ల ద్వారా విద్యాబోధనకు శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. ఈ హాస్టల్స్‌ను శాశ్వతంగా ఏర్పాటు చేసేలా జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించి రాష్ట్ర ప్రభుత్వాన్ని విన్నవించడం జరిగింది.

పెండింగ్‌లో ఉన్న నాడు-నేడు పనులపై ఏం చర్యలు తీసుకున్నారు?

ఎపిసి : మనబడి మన భవిష్యత్తు కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు గాను చర్యలు తీసుకుంటున్నాం. గతంలో ఆగిపోయినటువంటి పనులను కూడా చేపట్టేందుకుగాను దృష్టి సారించడం జరిగింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 312 పాఠశాలల్లో 1311 అదనపు తరగతి గదుల నిర్మాణాల జరుగుతున్నాయి. ఇప్పటికే 70 శాతం పనులు కూడా పూర్తి చేయడం జరిగింది.

ఈ విద్యా సంవత్సరం సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా ఇంకా ఎలాంటి కార్యక్రమాలను చేపడుతున్నారు?

ఎపిసి : పీఎం శ్రీ పథకం కింద 52 పాఠశాలల్లో క్రీడా మైదానాలు, కెమిస్ట్రీ ల్యాబ్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నాం. మొదట విడత కింద 29 పాఠశాలల్లో, రెండో విడత కింద 23 పాఠశాలల్లో పనులను చేపట్టాం. ఇటీవల ఉపాధ్యాయులకు ఫౌండేషన్ లిటరసీ న్యూమరసి కింద శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లాలోని 18 వేలకు పైగా బడిబాట ఉండే పిల్లలను గుర్తించి వారికి విద్యాబోధన అందించేందుకుగాను చర్యలు తీసుకుంటున్నాం.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

- డిఇఒకు ఎస్‌టియు వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.గోకారి, టికె.జనార్ధన డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శామ్యూల్ పాల్ ను ఎస్‌టియు ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం సమర్పించింది. ఎస్ గోకారి, టికె జనార్ధన్ మాట్లాడుతూ గ్రేడ్ :2 ప్రధానోపాధ్యాయుల పదోన్నతులకు పిఎస్‌హెచ్‌ఎంలు, అన్ని కేడర్ల స్కూల్ అసిస్టెంట్లకు 2002 అక్టోబర్ 1వ తేదీని పరిగణలోకి తీసుకుని కామన్‌గా సీనియరిటీని లెక్కించాలన్నారు. డిఎస్‌సి 2012 ఎస్‌జిటి ఉపాధ్యాయులందరికీ ఒకే జాయినింగ్ తేదీని ఇవ్వాలన్నారు. కోవిడ్ సమయంలో పనిచేసిన ఉపాధ్యాయులకు ఇఎల్స్ మంజూరు నమోదుకు వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని వారు డిఇఒను కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి జిల్లా విద్యాశాఖ అధికారి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.సుంకన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు రామచంద్ర , ఎస్‌టియు నాయకులు భాస్కర్ ,విక్టర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌టియు నాయకులు

8న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాక

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఈనెల 8న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లా పర్యటనకు రానున్నారు. అనంతపురం జిల్లా గుంతకల్లు నుండి మంగళవారం ఉదయం పత్తికొండకు చేరుకుంటారు. అక్కడ హంద్రీనీవా కెనాల్ ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం నేరుగా కర్నూలుకు చేరుకుని ఎన్‌డిఎ కూటమి నాయకులతో ప్రభుత్వ అత్యధిక గృహంలో సమావేశం అవుతారు. ఎంపీ ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధుల్లో కూడా సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం కలెక్టరేట్లో జరిగే డిఆర్‌సి సమావేశానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పాల్గొని డోన్ కు బయలుదేరి వెళ్తారు.

కొనసాగుతున్న పదో తరగతి మూల్యాంకనం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పదోతరగతి పరీక్షలకు సంబంధించి అన్ని సబ్జెక్టుల మూల్యాంకనం ఆదివారం నాటికి 33306 పేపర్ల మూల్యాంకనం పూర్తయిందని డిఇఒ ఎస్ శామ్యూల్ పాల్ వెల్లడించారు. దీంతో నాల్గురోజులకు గాను 57.27శాతంగా నమోదయ్యింది. మూల్యాంకన కేంద్రంలో ఎటువంటి అసౌకర్యాలు లేకుండా చర్యలు చేపట్టమన్నారు. చీఫ్ ఎగ్జామినర్లు 118 మంది, 713 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు 206 మంది స్పెషల్ అసిస్టెంట్లు హాజరయ్యారు. మూల్యాంకనానికి హాజరైన వారికి ఎటువంటి అసౌకర్యం లేకుండా విద్యాధికారులు పర్యవేక్షించారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బివి.రామయ్య , వేదికపై డిప్యూటీమేయర్, కార్పొరేటర్లు

ఆరోపణలు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధం

టిడిపి నేతలకు కర్నూలు మేయర్ బివై. రామయ్య సవాల్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆరోపణలు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమేనని టిడిపి నేతలకు కర్నూలు నగర మేయర్ బివై.రామయ్య సవాల్ విసిరారు. ఆదివారం గణేష్‌నగర్ లోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బివై రామయ్య వైసిపి నాయకులు, కార్పొరేటర్లతో కలిసి మాట్లాడారు. టిడిపి అడ్డదారుల్లో ప్రలోభాలు పెట్టి ప్రజలతో ఓట్లు వేయించుకొని గెలిచిందన్నారు. గెలిచిన నాటినుండి కర్నూలు నగర ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారో అందరికీ తెలుసునని, తాను 1994లో రాజకీయాల్లోకి వచ్చానని, గత 30 సంవత్సరాల రాజకీయ జీవితంలో మచ్చలేని మనిషిగా ఉన్నానని చెప్పారు. జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ గాను, రెండుసార్లు ఎంపీకి పోటీ చేశానని, ప్రస్తుతం మేయర్‌గా నాలుగు సంవత్సరాలు పూర్తి అయిన తర్వాత అవిశ్వాసం పెట్టి తనను మేయర్ పదవి నుండి తొలగించాలని చూస్తున్నారన్నారు. కొందరు కార్పొరేటర్లను సంతలో పశువుల మాదిరి కొన్నారన్నారు. ఏమి చేయలేని పరిస్థితిలో తనపై అభియోగాలు వేస్తున్నారన్నారు. సాయిబాబా ట్రస్ట్ నుండి టిడిఆర్ బండ్ల ద్వారా రూ.80 లక్షలు తీసుకున్నానని చెప్పడం హాస్యాస్పదమని, తాను అప్పు తీసుకుంటే అవినీతి అంటారా అని ప్రశ్నించారు. అప్పు ఇచ్చే వ్యక్తి టిడిఆర్ అమ్మి ఇచ్చినా, పొలం అమ్మించినా తనకేం సంబంధమని అన్నారు. ప్రైవేట్ వ్యక్తుల నుండి అప్పుగా తీసుకున్న చెక్కు ద్వారా తీసుకున్న దాన్ని అవినీతి అనడం సరికాదన్నారు. వైసిపి కార్పొరేటర్లు ప్రలోభాలకు లొంగి పోవడం లేదని, నిరాధార ఆరోపణలు చేయడం తగదన్నారు. తాటాకు చప్పుళ్ళకు భయపడే ప్రసక్తి లేదని అన్నారు. తాను 400 స్క్వేర్ ఫీట్ల ప్లాట్లు రెండు కొన్నానని, రిజిస్ట్రేషన్ కూడా అయిందన్నారు. నా భార్య టీచర్ ఉద్యోగ విరమణ అయ్యాక వచ్చిన డబ్బుతో ప్లాట్లు కొనడం తప్పా! ప్రాణం ఉన్నంతవరకు వైఎస్. జగన్‌తోనే ఉంటామని, వైఎస్. జగన్ కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధమే అని అన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగానికి భయపడేది లేదన్నారు. వచ్చేది మా ప్రభుత్వమేనని, వచ్చాక ఎవరిని వదిలిపెట్టబోమని అన్నారు. డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, మేయర్ పై వచ్చిన ఆరోపణలను ఖండించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసిపి నాయకులను బెదిరించడం, కార్పొరేటర్ల ఆర్థిక ఇబ్బందులను చూసి ప్రలోభాలు పెట్టి ఇద్దరు ముగ్గురిని టిడిపి వైపుకు లాక్కున్నారని చెప్పారు. అందరం కలిసి వారి ఆటలను సాగనివ్వకుండా తిప్పి కొడతాం అన్నారు. మాజీ గ్రంథాలయ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ మాట్లాడారు. 14 మంది కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

టౌన్ మోడల్ కళాశాల అడ్మిషన్లకు ఆహ్వానం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సర ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపల్ సి.సుంకన్న తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్ఇసి, ఎంఇసి, ఎంబైపిసి కోర్సులకు తెలుగు, ఇంగ్లీషు మీడియం గ్రూపులున్నాయన్నారు. అదేవిధంగా ఒకేషనల్ కు సంబంధించి ఆఫీస్ అసిస్టెంట్ షిప్, కంప్యూటర్ సైన్స్ గ్రూపులు ఉన్నాయన్నారు. తక్కువ ఫీజు నాణ్యమైన విద్య ఉంటుందన్నారు. జిల్లా స్థాయిలో , రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తూ ర్యాంకులు సాధిస్తున్నారన్నారు.

సి బెళగల్‌లో సిబి రాఘవరెడ్డి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-సి బెళగల్



రాఘవరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కుటుంబసభ్యులు

సి బెళగల్ మండల కేంద్రంలో మండల ఏర్పాటు పోరాట నాయకులు సిబి రాఘవ రెడ్డి విగ్రహాన్ని ఆయన సతీమణి సిబి వసుందరమ్మ కుటుంబీకులు విజయమ్మ, ఆదిత్యరెడ్డిలు ఆదివారం ఘనంగా ఆవిష్కరించారు. ఇందుకు గ్రామ పెద్దలు, ఆయా గ్రామాల పెద్దలు ఈరన్న గౌడ్, ఎస్ఎం బాషా, సర్పంచి పాండురంగన్న, సయ్యద్ బాబు, దస్తగిరి తదితరులు పాల్గొని విగ్రహం ఏర్పాటు అనంతరం పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. నాడు మండల ఏర్పాటు లో సిబెళగల్ పోలకల్ గ్రామాలు పోటీ పడ్డాయని అందులో ఇదే సిబెళగల్‌ను రాఘవ రెడ్డి కృషిని ప్రభుత్వం గుర్తించి ఏర్పాటు చేయడం గర్వకారణమని కొనియాడారు. మండల కేంద్రం ఏర్పాటయ్యాక రాఘవరెడ్డిని బలి తీసుకున్నారన్నారు. రాఘవరెడ్డి కృషి చిరస్మరణీయమని పలువురు పేర్కొన్నారు.

పారిశుధ్యం పై అవగాహన

ప్రజాశక్తి -మద్దికేర

అవగాహన కల్పిస్తున్న అధికారులు

గ్రామ పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పత్తికొండ డిఎల్‌పిఒ భద్రయ్య తెలిపారు. మండల కేంద్రమైన మద్దికేర బస్టాండు నుంచి మెయిన్ బజార్ వరకు ఆదివారం పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడినప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆ దిశగా ప్రతి ఇంటికి వెళ్లి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ప్రతి ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడానికి బాధ్యత తీసుకోవాలన్నారు. సర్పంచి బండారు సుహాసిని, సెక్రటరీ శివకుమార్, రామాంజనేయులు శ్రీనివాసులు అంజి చంద్రశేఖర్ గౌడ్ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధి లేక ఊర్లొదులుతున్నాం...

పొట్టకూటి కోసం పిల్లాపాపలతో ఇతర జిల్లాలకు వలస

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

'ఉన్న ఊర్లో ఉపాధి లేక ఊర్లు వదులుతున్నం' అంటున్నారు పేదలు....పాలకులు పేదల సంక్షేమం మరిచి, ఉపాధి చూపనందున పొట్టకూటి కోసం ఉన్న ఊర్లను వదిలి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లక తప్పడం లేదు. ఉపాధి పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘాలు చేసిన పోరాటాల ఫలితంగానే ప్రభుత్వాలు దిగివచ్చి ఉపాధి పనులు కల్పించేందుకు పూనుకున్నాయి. పాలకుల నిర్లక్ష్యంతో ప్రతి ఏట వర్షాకాలంలో కురిసిన వర్షాలతో వరద నీరు ఒడిసి పట్టుకోలేని కారణంగా వర్షపు నీరంతా సముద్రం పాలవుతుంది. సాగు నీటిపారుదల ప్రాజెక్టు లేనందున కర్నూలు జిల్లా కరువు కాటకాలతో, వ్యవసాయ భూముల్లో పంటలు పండగ వలసలు పోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతి సంవత్సరం దాదాపు ఐదు లక్షల మంది వలసలు వెళుతుంటారు.

కర్నూలు జిల్లాలో అత్యధికంగా కోసిగి, కౌతాళం, పెద్ద కడుబూరు, తుగ్గలి మండలాల్లోని ప్రజలు ఉపాధి పనుల కోసం వలసలు వెళుతుంటారు. జిల్లా జనాభాలో వ్యవసాయ కూలీలు 30 శాతం పశ్చిమ ప్రాంతం నుండి గుంటూరు, ప్రకాశం, తెలంగాణ ప్రాంతాలకు వలసలు వెళుతుంటారు. వలసలు వెళ్లే సమయంలో తక్కువ చార్జీలతో ప్రయివేటు వాహనాల్లో బయలుదేరి వెళ్లే సమయాల్లో ప్రమాదాలకు లోనై చనిపోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. పనులు చేసే ప్రాంతాల్లో వసతులు లేక అనారోగ్యాల బారిన పడుతున్నారు. పిల్లల చదువులు మధ్యలో ఆగిపోతున్నాయి. సోషియో ఎకనామిక్ సర్వే ద్వారా అత్యంత వెనుకబడిన జిల్లాల్లో ఒకటిగా కర్నూలు నిర్ధారణ అయింది. వ్యవసాయ కార్మిక సంఘాల పోరాటాల ఫలితంగా 2005లో దేశంలో, 2006లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో నార్పల మండలం బండ్లపల్లి గ్రామంలో ఉపాధి హామీ చట్టం పనులు ప్రారంభించారు. వంద రోజులు పని దినాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మారుతున్న పరిస్థితుల కనుగుణంగా నిత్యావసర ధరలు పెరుగు దలను దృష్టిలో ఉంచుకొని మళ్లీ పోరాటాలు చేయ డంతో పని దినాలు మార్పు వేసవిలో ఉపాధి, ఉదయం సాయంత్రం పనిచేయాలని, రోజుకు 200 క్యూబిక్ మీటర్లు పనిచేయాలని, రోజు కూలి రూ.300 గా నిర్ణయించారు. ఎండలు తీవ్రతతో ఉదయం సాయంత్రం పనిచేయకుండా ఒక పూటనే పనిచేయడంతో వారంలో మూడు రోజులు కూలీ మాత్రమే ఇస్తున్నారు. ఉపాధి కూలీలు పని చేసిన వారికి 8 వారాలుగా కూలి మొత్తం జిల్లా వ్యాప్తంగా రూ.20 కోట్లకు పైగా బకాయి ఉంది. కూటమి ప్రభుత్వానికి బకాయిలపై స్పందన లేదు. వలసలు అదే విధంగా అందరికీ పని కల్పించి ప్రతి వారం డబ్బులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. జిల్లాలోని వేదవతి, గుండ్రేవుల, మేలగనూరు వరద కాలువ నిర్మాణం చేపడితే శాశ్వతంగా వలసలు ఆగుతాయి.

మూటముల్లెతో రైలుకోసం ఎదురు చూస్తున్న వలస కూలీలు(ఫైల్)

పిల్లలను పోషించుకునేందుకు వలస పోతున్నం...

ఉరుకుందమ్మ, ఎమ్మిగనూరు మండలం, మాస్ మాన్ దొడ్డి

భర్త చనిపోయి నాలుగేళ్లయింది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోషించుకునేందుకు కూలికి పోక తప్పడం లేదు. నలుగురు కలిసి వలస పోతున్నాం. పిల్లలను బడికి పంపడానికి ఇంటి దగ్గర ఎవరూ లేరు. పిల్లవాడిని వెంటబెట్టు కుని పోతున్న. మాకు తెలిసిన పెద్దాయన కోడూరు మండలం పులకుర్తి కర్రన్న వెంట పనికి పోతున్న. అక్కడ ఇచ్చే కూలి కూడబెట్టుకొని నెల రోజుల తర్వాత ప్రతినెల 1వ తేదీ ఊరు వచ్చి పోతాం. ప్రభుత్వం ఉపాధి పనులు కల్పిస్తే ఊర్లో ఉండి పిల్లలను చదివించుకుంటాం.

కడుపు చేత పట్టుకుని వెళుతున్నాం

నర్సప్ప ,ఆస్పరి మండలం కారుమంచి గ్రామం

మా గ్రామంలో పనులు లేక తిన తిండి లేక కడుపు నింపుకునేందుకు కడుపు చేతబట్టి పనుల కోసం వలస పోతున్నాం. మా గ్రామం నుండి ఒక బ్యాచ్ 35 మంది కలిసి వెళుతున్నాం. అక్కడి రైతులు మాకు ఒక్కొక్కరికి రూ.450 రూపాయలు కూలి ఇవ్వడానికి కూడా బాధపడుతుంటారు. ఒక ఎకరా మిరప కోయడానికి మూడు రోజులు పడుతుంది. తేజ మిరపకాయ ఓ కింటా రూ.1200 ఉంది. రైతులు కూడా చాలా బాధలో ఉన్నారు.

ప్రతినెల పింఛన్‌కు ఒకటో తేదీన ఊరుకొస్తాం

పెద్ద ఓబులేసు గూడూరు మండలం వై.కానాపురం



రుద్ర సముద్రం కుంట దగ్గర మిరప తెంపె పనులకు పోతున్నాం. ఎక్కడ స్థలం ఉంటే అక్కడ గుడిసెలు వేసుకొని 34 మంది ఒక తావున ఉంటాం. కూలి రూ.450 ఇస్తారు. ప్రతి నెల 1వ తేదీ పింఛన్ల తీసుకునేందుకు సొంతూరికి వస్తాం. పింఛన్ తీసుకుని మళ్లీ పనుల కోసం బయలుదేరుతాం. ప్రభుత్వం ఉపాధి పనులు కల్పించి పేదలను ఆదుకోవాలి.

రామన్న కుటుంబానికి అండగా ఉంటాం

- ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి

రామన్న కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే బి.విరుపాక్షి తెలిపారు. మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన రామన్న (45) అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని ఎమ్మెల్యే విరుపాక్షి ఆదివారం తిమ్మాపురం గ్రామం చేరుకొని రామన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రామన్న మృతి చెందడం బాధాకరమని, ఆయన కుటుంబానికి అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నగర డోనా సర్పంచి మల్లమ్మ భర్త నాగేంద్ర, శేఖర్ ఉన్నారు.

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి, నాగేంద్ర

జనసేన ఆధ్వర్యంలో ట్యాంకర్లతో నీటి సరఫరా

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని దొడ గొండ గ్రామంలో నెలకొన్న నీటి ఎద్దడి దృష్ట్యా జనసేన ఆధ్వర్యంలో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశామని జనసేన మండల కన్వీనర్ అరవింద్ తెలిపారు. ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా గ్రామస్తులు నీటి సమస్యతో ఇబ్బంది పడకూడదని ట్యాంకర్లతో గ్రామానికి ఉచితంగా తాగునీరు సరఫరా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ప్రజలు కష్టాల్లో ఉంటే జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.

ట్యాంకర్ ద్వారా నీరందిస్తున్న అరవింద్

'భార్గవ్'లో క్రమశిక్షణతో కూడిన విద్య

- ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఆదోని

క్రమశిక్షణతో కూడిన విద్యనందించి విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని ఎంఇఒ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఎస్‌కెడి కాలనీలో ఉన్న భార్గవ్ పాఠశాల వార్షికోత్సవం కరస్పాండెంట్ పావని కుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఆదోని ఎంఇఒ-1 జి.రాజేంద్ర ప్రసాద్ హాజరయి మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో పోటీతత్వం పెరిగిందని, పరిస్థితులకు అనుగుణంగానే విద్యాబోధన అలవర్చుకోవాలని తెలిపారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, మంచి క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.. పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఎంఇఒ

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ గ్రామంలో మార్చి 28న ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందిన గిరిపోగు ప్రతాప్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం బాధిత కుటుంబాన్ని గ్రామ పెద్ద, వైసిపి రాష్ట్ర బూత్ సంయుక్త సహాయ కార్యదర్శి కొత్తకాపు మధుసూదన్ రెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి, సర్పంచి మొగతాల్ అరుణ్ కుమార్ పరామర్శించారు. ఒక్కొక్కరు రూ.10 వేల చొప్పున రూ.30 వేల ఆర్థిక సహాయం అందజేశారు. సర్పంచి సోదరుడు సునీల్ కుమార్, ఉప సర్పంచి భర్త బెల్ ఈరన్న, ఎంపిటిసి నామాల శ్రీను, మాజీ ఎంపిటిసి చాప ఈరన్న, గ్రామస్తులు కెజి.పురుషోత్తం రెడ్డి, ఏసేపు, నాగన్న, చంటి, బొంబే రాజశేఖర్, శివ, చాకలి బడేసాబ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న మధుసూదన్ రెడ్డి

అసంపూర్తిగా ప్రభుత్వ భవనాలు

- ఒక ప్రభుత్వంలో మొదలు పెడితే.. మరో ప్రభుత్వంలో ఆగిపోవాల్సిందేనా..?
- ప్రభుత్వ నిధులు దుర్వినియోగం
- పెండింగ్ బిల్లులు చెల్లించి నిర్మాణాలు పూర్తి చేయాలి
- మండల ప్రజల విజ్ఞప్తి

ప్రజాశక్తి - చిప్పగిరి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అన్ని వసతులూ సమకూర్చడానికి, వైద్యం, విద్య అందుబాటులో ఉండడానికి గ్రామీణ ప్రాంతాల్లో అనేక ప్రభుత్వ భవనాలను రూ.కోట్ల నిధులు వెచ్చించి నిర్మాణాలు చేపడుతోంది. మధ్యలో నిర్మాణాలు ఆగిపోయే పరిస్థితి ఏర్పడింది. చేపట్టిన నిర్మాణాలకు బిల్లులు సకాలంలో రావడం లేదని కాంట్రాక్టర్లు ఆవేదన చెందుతున్నారు. ఇంకో వైపు ప్రభుత్వం మారినప్పుడల్లా ఒక ప్రభుత్వం చేపట్టిన నిర్మాణాలు మరో ప్రభుత్వం నిర్మాణాలు చేపట్టడం లేక అంతటితోనే ఆగిపోయే వింతైన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు చర్చించుకుంటున్నారు. మండలంలో అనేక గ్రామాల్లో సచివాలయాలు, ఆర్‌బికెలు, విలేజ్ క్లినిక్‌లు, పాఠశాలలో నాడు-నేడు పథకం కింద పాఠశాలల మరమ్మతులు, అదనపు గదుల నిర్మాణాలకు రూ.కోట్ల నిధులను మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టింది. వాటిల్లో కొద్ది వరకు నిర్మాణాలు పూర్తయ్యాయి. ప్రారంభోత్సవం జరిగిన సచివాలయాల్లో విద్యుత్ కనెక్షన్, నీటి సరఫరా లేదనే కారణంతో అధికారులు విధులు నిర్వర్తించలేక దుర్వినియోగంగా మారాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఉన్నతాధికారులు కూడా వీటిపై అంత ప్రాధాన్యత ఇవ్వలేకపోతున్నందునే ఈ సమస్య ఏర్పడిందని ప్రజలు గుసగుసలాడుతున్నారు. ఆగిపోయిన వాటిలో రామదుర్గం, బెల్డోన, డేగలహాల్, గుమ్మనూరు ఉన్నాయని అధికారులు తెలుపుతున్నారు. నేమకల్లు గ్రామంలో 90 శాతం పూర్తయిన రైతు సేవా కేంద్ర భవనం 10 శాతం పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొంటున్నారు. ఆ 10 శాతం పూర్తయితే రైతు సేవా కేంద్ర భవనం రైతులకు అన్ని రకాలుగా ఉపయోగపడుతుందని రైతులు తెలుపుతున్నారు. చిప్పగిరి పాఠశాలలో నాబార్డ్ పథకం కింద అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో భూమి పూజను ప్రజాప్రతినిధులు ఆర్భాటంగా చేశారు. అక్కడ పునాదుల వరకే పిల్లర్లు వేసి వదిలేసినట్లు కనిపిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వ నిధులు వృథా కాకుండా ఆగిపోయిన నిర్మాణాలను కొత్త ప్రభుత్వం, ఉన్నతాధికారులు దృష్టి పెట్టి పూర్తి చేయాలని, మండల అధికారులతో ఒక నివేదికను తెప్పించుకొని వాటిని పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నేమకల్లులో తుది దశకు వచ్చి ఆగిపోయిన రైతు సేవా కేంద్రం నిర్మాణం

త్వరలో పూర్తి చేస్తాం

- ఎంపిడిఒ అల్లాబకాష్

ప్రభుత్వానికి నివేదికలు పంపాం. నిధులు రాగానే పూర్తి చేస్తాం. నగరడోన సచివాలయంలో నీరు, విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. చిప్పగిరి సచివాలయం కూడా త్వరలోనే పూర్తి చేస్తాం.

దూసుకొచ్చిన మృత్యువు...

- గొర్రెలు, గొర్రెల కాపరుల పైకి దూసుకెళ్లిన లారీ

- ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని ముగతి హైవేపై ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. గొర్రెలు, గొర్రెల కాపరుల మీదికి లారీ దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. అలాగే మూడు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఎస్ఐ కేశవ్ వివరాల మేరకు... ఆదివారం తెల్లవారుజామున ముగతి హైవేపై గొర్రెలు, గొర్రెల కాపరులపైకి లారీ దూసుకెళ్లింది. ఈ రోడ్డు ప్రమాదంలో ఆస్పరి మండలానికి చెందిన లింగప్ప (22) అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురు గొల్ల నరసప్ప, బోయ నరసప్ప, శ్రీనివాసులుకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంలో మూడు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. 20 గొర్రెలు కుంటు పడ్డాయి. లారీ డ్రైవర్ లారీతో పాటు పరారయ్యాడని తెలిపారు. బాధితుడు శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు. గ్రామస్తుల వివరాల మేరకు... గొర్రెల కాపరులు వివిధ గ్రామాల నుంచి గొర్రెలను కొనుగోలు చేసి ఆదివారం ఎమ్మిగనూరు సంతలో విక్రయించేవారని తెలిపారు. వారు సేకరించిన గొర్రెలను శనివారం రాత్రి ధర్మపురం గ్రామంలో ఉంచారని, ఆదివారం సంత కావడంతో గొర్రెలను తీసుకొని కాపరులు కాలినడకన తెల్లవారుజామున ఎమ్మిగనూరుకు వెళ్తుండగా లారీ అతివేగంగా వచ్చి దూసుకెళ్లిందని తెలిపారు.

మృత్యువాత పడిన గొర్రెలు

చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ఘనంగా ఎమ్మెల్యే బీవీ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని టిడిపి కార్యాలయం వద్ద ఎమ్మిగనూరు ఎమ్మెల్యే, పిఎసి కమిటీ రాష్ట్ర సభ్యులు డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి పుట్టినరోజు వేడుకలను టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా భారీ కట్ చేసి మిఠాయిలు తినిపించుకున్నారు. అనంతరం టిడిపి నాయకులు నజీర్ సాహెబ్, ఎన్‌వి.రామాంజనేయులు, బేతాళ బడేసాహెబ్, తిరుపతయ్య నాయుడు, పి.రంగముని, రంగస్వామి నాయుడు, ఎస్.షేక్షావలీ, పెద్దమరివీడు మల్లయ్య, పూజారి చంద్ర, మిన్నెల్లా, రమేష్ నాయుడు, గౌవుండా రహంతుల్లా, ఫక్రుద్దీన్, మదీనా, పోలకల్ వెంకటేష్ మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, ఎమ్మెల్యే బీవీ తండ్రి కీర్తిశేషులు బీవీ.మోహన్ రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆయన ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, వచ్చే పుట్టినరోజు నాటికి ఆయనను రాష్ట్ర మంత్రిగా చూడాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఎల్ఎల్‌సి వైస్ ఛైర్మన్ అచ్చుగట్ల హుస్సేన్, టిడిపి సీనియర్ నాయకులు గాజులదిన్నె హనుమంతు, గంజిహళ్లి వెంకట కృష్ణమ నాయుడు, చిన్న నేలటూరు నాగన్న, గాజులదిన్నె ప్రభాకర్, చంద్రన్న పాల్గొన్నారు.

నందవరం : ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి పుట్టినరోజు వేడుకలను టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బీవీ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం టిడిపి నందవరం కార్యాలయంలో నాయకులు కేక్ కట్ చేసి, బాణసంచా కాల్చారు. చిన్న రాముడు, ఖాసీం వలీ, మిల్లు నారాయణరెడ్డి, వడ్డే గోపాల్, ఈషా, రహిమాన్ బాష, డబ్బా ఈరన్న, రఫీ, నరసప్ప, భార్గవ్ యాదవ్, కైరవాడి వీరేష్, సత్యా రెడ్డి, నాగలదిన్నె ఉరుకుందు, సుధీర్, సలీం పాల్గొన్నారు.

గోనెగండ్లలో కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

కేక్ కట్ చేస్తున్న నాయకులు

మతి స్థిమితం లేని యువకుడు మృతి

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని ములుగుందం గ్రామ పొలాల్లో దేవనకొండ మండలం తెర్నేకల్ గ్రామానికి చెందిన ఉప్పర ఉమాపతి (30) మతి స్థిమితం లేని యువకుడు మృతి చెందినట్లు సిఐ మస్తాన్ వలీ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడారు. ఉదయం పొలం పనుల కోసం మహిళా రైతు దస్తగిరమ్మ పొలానికి వెళ్లగా పొలంలో మృతదేహం పడి ఉన్న విషయాన్ని గ్రామస్తులకు తెలిపారని, స్థానికులు తలారులకు, రెవెన్యూ, పోలీసులకు సమాచారం ఇచ్చారని తెలిపారు. సిఐ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు తెర్నేకల్ వాసిగా గుర్తించారు. ఉమాపతి గత నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయారు. డాగ్ స్క్వాడ్‌తో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ప్రభుత్వాస్పత్రికి తరలించామరు. మృతునికి భార్య సుజాత, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - నందవరం

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని బాపురం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ కేశవ్ వివరాల మేరకు... బాపురం గ్రామానికి చెందిన మహేష్ (32) అనారోగ్య కారణంతో ఆయన నివాసంలో శనివారం రాత్రి 11 గంటలకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మహేష్ మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పని చేసేవారు. వారి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

- కళాశాల ప్రిన్సిపల్ వరదరాజులు

ప్రజాశక్తి - చిప్పగిరి

పదో తరగతి చదివిన విద్యార్థులు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు అడ్మిషన్లు ఈనెల 7 నుంచి ప్రారంభమవుతున్నాయని కళాశాల ప్రిన్సిపల్ వరదరాజులు తెలిపారు. ఆదివారం కళాశాల కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిప్పగిరి ప్రభుత్వ కళాశాలలో ఎంపిసి, బైపిసి, సిఇసి గ్రూపుల్లో తెలుగు, ఇంగ్లీష్ మీడియం గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. అడ్మిషన్ కావాల్సిన వారు వెంటనే కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్ రికార్డ్స్ ఇస్తామని చెప్పారు. మండలంలోని గ్రామాల్లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా రాఘవేంద్రుని స్వర్ణ పల్లకోత్సవం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్ర స్వామి మఠంలో రాఘవేంద్రుని స్వర్ణ రథోత్సవం వైభవంగా సాగింది. ఆదివారం ఉత్సవ మూర్తి అయిన ప్రహ్లాద రాయులను స్వర్ణ రథంపై ఉంచి పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులు మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో ఘనంగా రథోత్సవం సేవాదారులతో లాగించారు. అంతకుముందు స్వర్ణ రథం సేవ చేయించిన భక్తులచే సంకల్పం చేయించారు.

కనుల పండువగా రాములోరి కల్యాణం

ప్రజాశక్తి - ఆదోని

నియోజకవర్గంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవం కనుల పండువగా సాగింది. ఆదివారం నియోజకవర్గంలోని పట్టణం, గ్రామాల్లోనూ కల్యాణోత్సవంలో వేలాదిమంది భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మండిగిరి పంచాయతీలోని సీతారామ నగర్‌లో శ్రీఆంజనేయ లక్ష్మణ సమేత శ్రీసీతారామచంద్ర మూర్తులకు పంచామృతాభిషేకం, పంచసూక్త విధానంలో శుద్ధోదక స్నానం నిర్వహించారు. అనంతరం అష్టోత్తర పుష్పార్చన, అలంకారం, శ్రీగణపతి హోమం, నవగ్రహ హోమం, శ్రీసీతా రామలక్ష్మణ ఆంజనేయస్వామికి మూల మంత్ర హోమాలు నిర్వహించారు. అనంతరం శ్రీసీతారాముల కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. వైభవంగా రథోత్సవం నిర్వహించారు. అలాగే ఇంద్రానగర్ సీతా రామ దేవాలయంలో, శంకర్ నగర్ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో, బోయ గేరి బంగారమ్మ అవ్వ దేవాలయం దగ్గర ఉన్న పాతూరు ఆంజనేయస్వామి దేవాలయంలో, పెద్ద తుంబలం శ్రీరామ దేవాలయంలోనూ సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. **మంత్రాలయం**లోని పాత ఊరిలో ఉన్న శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీసీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుల వేదమంత్రోచ్ఛరణల నడుమ ఆంజనేయ స్వామికి, ఉత్సవ మూర్తులు సీతారామ సహిత లక్ష్మణ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం ఆలయ ఆవరణంలో అసూరి సునీల్ కుమార్ చార్యులు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. ముందుగా విశ్వక్ సేనా పూజ, పుణ్యాహవచనం, గణపతి పూజ, కంకణ ధారణ, మాంగళ్య ధారణ చేశారు. అనంతరం మంగళ వాయిద్యాలు, భాజాభజంత్రీల నడుమ శ్రీసీతారాముల ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ అర్చకులు రమణయ్య, భీమాచార్యులు, మధుసూదనా చార్యులు, సూర్యనారాయణ చార్యులు, భాస్కరా చార్యులు, శ్రీనివాసచార్యులు, సత్యనారాయణ, వెంకటేష్, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, కురువ మల్లికార్జున, శివప్ప, టిడిపి నాయకులు అశోక్ రెడ్డి, వరదరాజులు, నరసింహ పాల్గొన్నారు. **హాలహర్వి** మండలంలోని హాలహర్వి, బాపురం, గూళ్యంలోని రామాలయంలో శ్రీరామ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం 10.31 గంటలకు రామాలయం కల్యాణ మండపం వద్ద ఉత్సవ మూర్తులకు కల్యాణం నిర్వహించారు. గ్రామ ప్రముఖులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, వివిధ గ్రామాల ప్రజలు అందరూ పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. **కౌతాళం** మండలంలోని రాజానగర్, కుంబాలనూరు క్యాంప్, బుడుముల దొడ్డి ఆంజనేయ స్వామి, బదినేహాల్ గ్రామాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కౌతాళం మండలం రాజానగర్ క్యాంపులో శ్రీసీతారాముల దేవాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించా రు. కుటుంబ సమేతంగా పాల్గొనిటిడిపి నాయకులు, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి, క్లస్టర్-3 ఇన్‌ఛార్జీ అల్లూరి వెంకటపతి రాజు పూజలు నిర్వహించారు. **హొళగుంద** మండలం సులు వాయి గ్రామంలోని శ్రీఆంజనేయ స్వామి మహా రథోత్సవం కనుల పండువగా సాగింది. శ్రీఆంజనేయ స్వామికి పూజలు, అభిషేకాలు, ఆకు పూజ ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. ఆలయ అర్చకులు వైష్ణవ రంగస్వామి పూజలు చేశారు. సాయంత్రం స్వామివారిని రథంలో ప్రతిష్ఠించి హనుమాన్ సర్కిల్ వరకు శ్రీఆంజనేయ స్వామి మహా రథోత్సవం నిర్వహించారు. **నందవరం** మండలంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. ముగతిలోని రామలక్ష్మణుల ఆలయంలో శ్రీబెల్దెన్ స్వామి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. ముందుగా విశ్వక్ సేనా పూజ, పుణ్యాహవచనం, గణపతి పూజ, కంకణ ధారణ, మాంగళ్య ధారణ చేశారు. అనంతరం సీతారాముల ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. విరుపాక్షి రెడ్డి, ఉరుకుంద రెడ్డి, ఎద్దులయ్య, సోమనాథ్, చిన్నారులు పాల్గొన్నారు. **దేవనకొండ** మండలంలోని తెర్నేకల్ గ్రామ శివారులో వెలసిన తమ్మి దొడ్డయ్య స్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు ఆదివారం వైభవంగా సాగాయి. గ్రామానికి చెందిన జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషనర్ నారాయణ రెడ్డి దంపతులు వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం, అభిషేకాలు నిర్వహించి సీతారాముల విగ్రహాలకు కల్యాణం జరిపించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయ శిఖర గోపుర నిర్మాణానికి రూ.85 వేలను నారాయణరెడ్డి ఆలయ నిర్వాహకు లు హనుమన్నకు అందజేశారు. మాజీ సర్పంచి రాజన్న, తమ్మి దొడ్డయ్య స్వామి ఆలయ నిర్వాహకులు చెన్నప్ప, వార్డు సభ్యులు వడ్డే మాదన్న, గ్రామ పెద్దలు దొడ్డప్ప, పరమేష్, హనుమంతు పాల్గొన్నారు. **చిప్పగిరి**లోని ఆంజనేయ స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే విరుపాక్షి, కుటుంబ సభ్యులు సీతారామ, లక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

కౌతాళంలో కల్యాణోత్సవం

చిప్పగిరి : పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

మంత్రాలయంలో స్వామి, అమ్మవార్లను ఊరేగిస్తున్న దృశ్యం

దేవనకొండలో

నందవరంలో

ఆదోనిలో...

వక్ఫ్ భూముల సంరక్షణకు పాటుపడాలి

- ఎంహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్

ప్రజాశక్తి - ఆదోని

వక్ఫ్ భూముల సంరక్షణకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకునేలా చొరవ చూపాలని ఎంహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ కోరారు. ఎంహెచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మహ్మద్ ఫారూఖ్ షుబ్లీని విజయవాడలోని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం నూర్ అహ్మద్, టిడిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఫక్రుద్దీన్ మాట్లాడారు. ఎన్‌డిఎ (బిజెపి కూటమి) తెచ్చిన వక్ఫ్ బిల్లు ప్రతికూల ప్రభావం ముస్లిం ధార్మిక స్థలాలు, ఆస్తులపై చూపుతుందని తెలిపారు. వక్ఫ్ ఆస్తులు ముస్లిం పేదలకు మేలు చేసే విధంగా ఎలా ఉపయోగించాలి, వక్ఫ్ భూముల సంరక్షణ గురించి ఎంహెచ్‌పిఎస్ ప్రజలకు ఎలా సహాయ పడాలనే విషయాలపై ఎంహెచ్‌పిఎస్ పోషించాల్సిన పాత్రను గురించి ఫారుఖ్ షుబ్లీతో చర్చించినట్లు తెలిపారు. రాష్ట్రంలో వక్ఫ్‌కు చెందిన ఒక సెంటు భూమి కూడా కోల్పోకుండా కట్టుదిట్టంగా ముందుకు వెళ్లేందుకు ఎంహెచ్‌పిఎస్ కృషి చేస్తుందని చెప్పారు.

ఫారుఖ్ షుబ్లీని కలిసిన నూర్ అహ్మద్

ప్రేమానురాగాలతో పిల్లలను ప్రోత్సహించండి

- ఉత్సాహంగా నృత్యం చేసిన విద్యార్థులు

- వైభవంగా ప్రతిభ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - కౌతాళం

పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని గుర్తించి ప్రేమానురాగాలతో ప్రోత్సహించాలని మోటివేషన్ మాస్టర్ హర్ష కిరణ్, ప్రతిభ హైస్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాషా తెలిపారు. మదీనా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతిభ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ 22వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు, చిన్న, చిన్న విద్యార్థులు నృత్యాల ద్వారా చేసిన హంగామా అందరినీ ఆకట్టుకుంది. విద్యార్థులు ఉత్సాహంగా, ఉల్లాసంగా ఎన్నో రకాల డ్యాన్సులతో ఆనంద భరితంగా ఉత్తేజపరిచారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడారు. సమాజంలో చదువు ఎంత అవసరం ఉందో, నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, తల్లితండ్రుల ఆశయాలు, వారి శ్రమ, పాఠశాల యాజమాన్యం కృషి, ఉపాధ్యాయుల బోధన అంశాలు ఇలా ఎన్నో విషయాల గురించి వివరించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరూ డాక్టర్లు, కలెక్టర్లు, ఇంజినీర్లు కాలేకపోయినా మోసాలకు, దొంగతనాలకు అలవాటు పడకుండా ఉంటే చాలు అని తెలిపారు. పాఠశాలలో చదువుకున్న ప్రతి ఒక్కరూ ఉద్యోగులు కాలేరని, గౌరవంగా జీవించగలరని కచ్చితంగా చెప్పగలమని అన్నారు. తల్లిదండ్రులను గౌరవించి, క్రమశిక్షణతో నడుచుకోవడం నేర్చుకుంటే చాలు అన్నారు. ఉపాధ్యాయులు మంచి క్రమశిక్షణతో, నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలని తెలిపారు. విద్యార్థులకు పరీక్షల్లో మార్కుల విషయంలో తక్కువ, ఎక్కువ వచ్చాయని నిందలు వేయకుండా తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించినప్పుడే తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులు కూడా రాణిస్తారని చెప్పారు. విద్యార్థులను చదివించడానికి తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడుతున్నారని, వాటిని విద్యార్థులు దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. అప్పుడే ప్రతి విద్యార్థి కష్టపడి చదవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. తల్లిదండ్రుల అతి గారాబం కూడా ప్రమాదకరమన్నారు. కుల, మతాలకు అతీతంగా సమూహంగా ఉండే చోటే ఈ విద్యాలయాలు అని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల ఆనందాలను చూసే ఏకైక పండగ ప్రతిభ హైస్కూల్ వార్షికోత్సమని జగద్గురు ఖాదర్ లింగ స్వామి పీఠాధిపతి సయ్యద్ జైనులబుద్దీన్ మున్నా పాషా, గూటుపల్లి తాత ఇద్రూస్ బాష, తెనాలి రామకృష్ణ, బుజ్జి ఇలా రా సినిమాల ప్రొడ్యూసర్ జగదీష్ ముఖ్య అతిథులుగా హాజరయి తెలిపారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

నృత్యం చేస్తున్న చిన్నారులు

IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL DISTRICT JUDGE : KURNOOL AT ADONI

I.A.No.88/2023

Gaffar Saheb Died by L.Rs.
Esvi Rahina Bee & others. ...Petitioners

Vs

Ucheeramma @ Rajamma & others. ...Respondents

Notice to Respondents

To
R.4
Nagamma W/o Ganganna
D/o Late Hanumanthappa, R/o 26thg ward,
Near Maremma temple, Siruguppa Bellary Dist.
R.5.
Eramma W/o Sunni, Hindu, Major,
D/o Late Hanumanthappa by his 2nd wife
Eramma, D.No.5/6, Santhekudlur village,
Adoni mandal

Whereas the above named petitioners filed the above appeal against you as against the decree and judgment in O.S.No.226/2014 of II Additional Junior civil Judge court, Adoni with delay petition to condone the delay in filing the appeal. Hence you are hereby required to appear before this court On **02.05.2025 at 10.30 AM** and answer the said appeal, otherwise the matter will be decide exparte.

(By court Order)

B. Adisheshappa,
Advocate,
Yemmiganur 518 360,
Kurnool Dist.
Cell No.9885965252.